ప్రజాశక్తి

శుక్రవారం 30 ఆగస్టు 2024

8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

దిద్దుబాటు లేదు... సర్దుబాటే..!



- గత ప్రభుత్వ బాటలో కూటమి ప్రభుత్వం
- రద్దు చేయని 117 జిఒ
- మిగులుచూపిన ఉపాధ్యాయులతో ఖాళీల్లో సర్దుబాటు
- 43 మంది హిందీ ఉపాధ్యాయుల కొరత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉపాధ్యాయుల్లేని ప్రభుత్వ పాఠశాల ఏ ఒక్కటీ ఉండకూడదన్న ప్రభుత్వ విధానం నినాదంగా ఉంది. గత ప్రభుత్వ నష్టం తెచ్చిన విద్యా విధానాలు, జిఒలు సరిదిద్దకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో వైసిపి ప్రభుత్వ బాటలో ఈ ప్రభుత్వం నడుస్తోంది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సంపూర్ణంగా ఉన్నారని చెప్పుకునేందుకు ఉపాధ్యాయులను ఎంత సర్దుబాటు చేసినా హిందీ ఉపాధ్యాయుల కొరత తీరలేదు. గత ప్రభుత్వం అమలుచేసిన 117 జిఒను ఈ ప్రభుత్వమూ కొనసాగిస్తోంది. 117 జిఒ అనుసరించి తరగతిలో విద్యార్థుల సంఖ్యను పెంచి, మిగులుగా తేల్చిన ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను సర్దుబాటు చేయడానికి ఉపక్రమించింది తప్ప, విద్యాబోధనకు నష్టం తెచ్చిపెట్టిన 117 జిఒను రద్దు చేయలేదు. సబ్జెక్టు టీచర్లులేని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పాఠ్యాంశాలు చెప్పగలిగిన ఎస్‌జిటిలతో సర్దుబాటు చేయించింది. అయినా ఇప్పటికీ నర్సీపట్నం డివిజన్‌లో 43 హిందీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుతో భర్తీ చేయాలనుకున్నా, జిల్లాలో మిగులు హిందీ ఉపాధ్యాయులు లేరు. సర్దుబాటు గురువారం నాటికి ముగిసేనాటికి హిందీ, ఇంగ్లీషు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సివుంది. మూడు ఇంగ్లీషు పోస్టులకు 15 మంది ఉపాధ్యాయులుండగా, 44 హిందీ ఉపాధ్యాయులకు ఒక్కరే ఉన్నారు. చివరి వరకు చేసిన సర్దుబాటుతో 43 హిందీ పోస్టులు

మిగతా 2లో..

117 జిఒతో మిగులుగా తేల్చిన ప్రధాన సబ్జెక్టు ఉపాధ్యాయులు

ఎస్‌జిటిలు	453
ఇంగ్లీష్	36
తెలుగు	34
హిందీ	7
లెక్కలు	18
ఫిజికల్ సైన్సు	38
బయోలాజికల్ సైన్సు	42
సోషల్	71

సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల కొరత

ఎస్‌జిటిలు	78
ఇంగ్లీష్	17
తెలుగు	16
హిందీ	51
లెక్కలు	22
ఫిజికల్ సైన్సు	10
బయోలాజికల్ సైన్సు	21
సోషల్	23

90 మిలియన్ టన్నుల లక్ష్యం

సరికొత్త రికార్డు కోసం విశాఖ పోర్టు కసరత్తు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పోర్టు ట్రస్ట్ అథారిటీ (విపిఎ) సరకు రవాణాలో సరికొత్త రికార్డు కోసం కసరత్తు ఆరంభించింది. గత ఏడాది 81.09 మిలియన్ టన్నులను హేండ్లింగ్ చేసిన పోర్టు ఈ ఏడాది పోర్టు ట్రాఫిక్ అధికారులు 90 మిలియన్ టన్నుల సరకు రవాణా మైలు రాయిని దాటే దిశగా సరకుల ఎగుమతి, దిగుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. టర్నోవర్ కూడా ఏటా రూ.1500కోట్ల మేర విపిటి సాధిస్తున్న విషయం తెలిసిందే. క్రూడ్ ఆయిల్, మాంగనీసు, బాక్సైట్ కూడా విశాఖ పోర్టుకు రవాణా అవుతోంది. దేశంలో మేజర్ పోర్టులు 12లో 2, 3 స్థానాల్లో నిలుస్తూ వస్తోంది విశాఖ పోర్టు. హెచ్‌పిసిఎల్ క్రూడ్‌ఆయిల్ కోసం ఒక బెర్తు పోర్టులో ఉంది. పోర్టులోని సుమారు 30 కార్గో హేండ్లింగ్ బెర్తుల్లోకి 12 వరకూ పిపిపిలో నడుస్తున్నాయి. ఇంకా పలు బెర్తులను ఆధునీకరించడం ద్వారా సరకు రవాణాను రాగల 2ఏళ్లలో 100 మిలియన్ టన్నులకు తీసుకెళ్లే యత్నాలు ఊపందుకున్నాయి.

తాజాగా మరో బెర్త్ పిపిపి...

తాజాగా ఈక్యూ 6 బెర్తు (255 మీటర్ల పొడవు, 12.10మీటర్ల డ్రెడ్జ్ లోతు) మేర పెంచేందుకు గానూ పిపిపిలో ఒప్పందం పోర్టు కుదుర్చుకుంది. ఈ క్యూ 6 బెర్త్ పాక్షిక యాంత్రీకరణ కోసం ఎవర్ సన్ మెరైన్ పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఇటీవలే ఎంఒయు కుదుర్చుకుంది. సుమారు రూ.66.12కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారు. అత్యధిక సామర్థ్యంతో కార్గో హేండ్లింగ్ చేసే దిశగా పోర్టు యాజమాన్యం ఈ చర్యలు చేపడుతున్నట్లు ఇటీవలే ప్రకటించింది. విశాఖ పోర్టులో ఈక్యూ 1 అదానీ బెర్తును ఏడాదిన్నర క్రితమే పోర్టు స్వాధీన పరచుకుని ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ (ఒఅండ్ఎం) నిర్వహణలో కార్గో చేపడుతోంది. ఎస్సార్, వేదాంత, వైజాగ్ సీ పోర్టు, విసిటిపిఎల్ ఇంకా మరికొన్ని బెర్తులు పిపిపిలోనే పోర్టు నిర్వహిస్తోంది. తాజాగా పోర్టు ఆసుపత్రిని రూ.261 కోట్లతో పిపిపిలో ఆధునాతనంగా నిర్వహించేందుకు ప్రయివేటుకు ఇచ్చేందుకు నిర్ణయించి పనులు చేపడుతోంది. గతం నుంచీ పోర్టులో పిపిపి

మిగతా 2లో..

పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించాలని ధర్నా

▶ వార్త మెయిన్‌లో..

భారత నౌకాదళంలోకి ‘ఐఎన్ఎస్ అరిఘాట్’

▶ వార్త మెయిన్‌లో..

తుపానుపై అప్రమత్తం - జివిఎంసి కమిషనర్

▶ వార్త 2లో..

హనీ ట్రాప్ వ్యవహారంలో స్పీడ్ పెంచిన ఎన్ఐఎ

▶ వార్త 2లో..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో...

వైద్య సేవలు మెరుగుపర్చాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో వ్యాధుల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని ఆరోగ్య అత్యవసర సేవల కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగుపర్చాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు సరిగా లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. వ్యాధుల తీవ్రతను బట్టి వైద్య పరీక్షలు, మందులు, మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత ఉండడంతో బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, వ్యాధులు పెరగకుండా గ్రామీణ, పట్టణాల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని కోరారు.

పెరుగుతున్న జ్వరాలు, మలేరియా, టైపాయిడ్, డెంగీ తదితర వ్యాధులు నియంత్రణకు అవసరమైన చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ప్రైవేట్ ఆసుపత్రులకు పేదలు వెళ్లకుండా తగిన వైద్య సదుపాయాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కల్పించాలని, ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో ఆగస్టు చివరికి మలేరియా 195, జ్వరాలు 12వేలకు పైగా నమోదు అయ్యాయని, ఈ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వైద్య సేవలు విస్తృత పర్చాలని కోరారు. వ్యాధులు ఎక్కువ ఉన్న గ్రామాలు, పట్టణాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు.

ప్రఖ్యాత ఐటి పరిశ్రమలను ఎపికి రప్పిస్తాం

- 100 బిలియన్ ఎకానమీగా విశాఖ మహానగరాన్ని అభివృద్ధి చేస్తాం
- ఎపి ఐటి అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో : మెరుగైన ఐటి పాలసీని ప్రకటించి, దేశంలోనే ప్రఖ్యాత కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ఐటి అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ గురువారం ముఖాముఖి సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, ఐటి రంగంలో ఇప్పటికే అభివృద్ధి సాధించిన హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్‌లల్లో అమలుచేస్తున్న పాలసీలను అధ్యయనం చేసి మెరుగైన ఐటి పాలసీని తీసుకొస్తామని తెలిపారు. రాష్ట్రంలో అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న తమ ప్రభుత్వ లక్ష్యంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలు కీలకపాత్ర పోషించబోతున్నాయని వివరించారు. దేశంలో టాప్ -10 ఐటి కంపెనీలతో చర్చలు జరుపుతున్నామని, త్వరలో రాష్ట్ర ప్రజానీకం ఐటి పరిశ్రమ పెట్టుబడులపై

మిగతా 2లో..



ఎపి ఐటి అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

మొదటి పేజీ తరువాయి..

దిద్దుబాటులేదు... సర్దుబాటే...!

ఖాళీగా తేలాయి.

గత ప్రభుత్వంలో జరిగిన రేషనలైజేషన్‌తో జిల్లాలో 765 ఉపాధ్యాయులను విద్యాశాఖ మిగులుగా తేల్చింది. ఇదే సందర్భంలో వివిధ కేటగిరీలకు చెందిన దాదాపు 238 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. ఈ కొరతను మిగులు ఉపాధ్యాయులతో సర్దుబాటు చేసేందుకు విద్యాశాఖ కౌన్సెలింగ్ నిర్వహించింది. తొలుత మండల స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ కౌన్సెలింగ్ పూర్తయింది. 44 హిందీ, మూడు ఇంగ్లీష్ ఉపాధ్యాయుల ఖాళీలు ఉండడంతో వీటిని భర్తీచేసేందుకు డివిజన్ స్థాయి కౌన్సెలింగ్ నిర్వహించారు. మూడు ఇంగ్లీష్ పోస్టులు భర్తీకి ప్రభుత్వం మిగులుగా చూపుతున్న 15 మంది ఉపాధ్యాయులున్నారు. 44 హిందీ ఖాళీలను భర్తీ చేయడానికి ఒక హిందీ టీచర్ మాత్రమే మిగులుగా ఉండడంతో, మిగిలిన 43 హిందీ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేకపోయారు.

90 మిలియన్ టన్నుల లక్ష్యం

పనులు అత్యంత వేగంగానే సాగుతున్నాయి. శాలిగ్రాంపురంలోగల 17 ఎకరాలను రూ.150 కోట్లకు లీజుకు పోర్టు యాజమాన్యం ఇనార్బిట్ మాల్‌కు రహేజా సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. తాజాగా కార్గో హేండ్లింగ్‌పై దృష్టిసారించింది. పక్కనే గల గంగవరం పోర్టులో కేవలం 9 బెర్తులు, కార్గో హేండ్లింగ్ ఏటా 35 మిలియన్ టన్నులే చేస్తున్నా విపిటికి పక్కలో బల్లెం మాదిరిగా నిలిచింది. సరకు రవాణా ఇటువైపు మరలకుండా పిపిపి చర్యలంటూ విశాఖ పోర్టు అధికారులు చెబుతున్నారు. అయితే పిపిపి విధానం పలువురి విమర్శలకు గురౌతోంది.

ప్రఖ్యాత ఐటి పరిశ్రమలను ఎపికి రప్పిస్తాం

శుభవార్త వింటారని తెలిపారు. ఐఎస్‌బి తరహాలో విశాఖలో ప్రపంచస్థాయి ఎఐ యూనివర్సిటీని ఏర్పాటుచేస్తామని, ఎఐ హబ్‌గా కూడా విశాఖను తీర్చిదిద్దుతామని, రోబోటిక్స్, హెల్త్ కేర్, ఎడ్యుకేషన్ వంటి రంగాలతో అనుసంధానించి ఐటిని వేగవంతంగా అభివృద్ధిచేస్తామని చెప్పారు. రాబోయే అయిదేళ్లలో విశాఖపట్నాన్ని 100 బిలియన్ డాలర్ల ఎకానమీ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు.

వినాయక ఉత్సవాల అనుమతులకు సింగిల్ విండో పోర్టల్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వినాయక చవితి ఉత్సవాల అనుమతులకు సింగిల్ విండో పోర్టల్‌ను విశాఖపట్నంలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామని, మొబైల్ ఫోన్ ద్వారా కూడా ఉత్సవాలకు అనుమతులు పొందవచ్చునని తెలిపారు. శుక్రవారం నుంచి ఈ యాప్ అందుబాటులోకి వస్తుందని, ఈ యాప్‌లో ఉత్సవాలకు సంబంధించి వివరాలు పెట్టిన తర్వాత అన్ని విభాగాల అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని చెప్పారు. వినాయక ఉత్సవాల భద్రత విషయంలో రాజీ పడే సమస్య లేదని, చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉత్సవాలు జరుపుకోవాలని ఆమె ప్రజలకు సూచించారు.

రెండు నూతన చానళ్లను తెచ్చిన సామ్‌సంగ్ టివి ప్లస్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతదేశంలో సామ్‌సంగ్ బ్రాండ్ ఉచిత యాడ్–సపోర్టెడ్ స్ట్రీమింగ్ టీవీ (ఫాస్ట్) సర్వీస్ అయిన సామ్‌సంగ్ టివి ప్లస్ దాని పోర్ట్‌ఫోలియోలో ఆజ్‌తక్ హెచ్‌డి అండ్ ది లాలాన్‌టాప్ ఫాస్ట్ ఛానెళ్లను తీసుకొచ్చినట్లు శాంసంగ్ టీవీ ప్లస్ ఇండియా ప్రతినిధి కునాల్ మెహతా వెల్లడించారు. ఈ సందర్భంగా మద్దిలపాలెం లోని సామ్‌సంగ్ షో రూమ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ సామ్‌సంగ్ టివి ప్లస్ టివి టుడే నెట్‌వర్క్ మధ్య భాగస్వామ్యం, అత్యధిక నాణ్యత గల ప్రోగ్రామింగ్‌ను అందించడానికి , ప్రపంచంలో వీక్షకుల అవసరాలను తీర్చడానికి సామ్‌సంగ్ వీటిని అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఫాస్ట్ ఛానల్ ఆఫరింగ్, ప్రీమియం ఉచిత కంటెంట్‌ను చూడాలనే ప్రేక్షకుల కోరికను ఇది తీరుస్తుందని పేర్కొన్నారు.



గురువారం మధ్యాహ్నం విశాఖ వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

తుపానుపై అప్రమత్తం

జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్



ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : తుపాను కారణంగా భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో నగర ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం వాటిళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్ పలు విభాగాధిపతులను అప్రమత్తం చేస్తు ఉత్తర్వులు జారీచేశారు. నగరంలో ప్రస్తుతం భారీ వర్షాలు పడుతున్నందున జివిఎంసి అడిషనల్ కమిషనర్–1 పర్యవేక్షణలో కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్‌లో 24 గంటలు కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగాధిపతులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కొండవాలు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, నిరంతరం తాగునీటికి అంతరాయం లేకుండా చూడాలని, ఓవర్ హెడ్ ట్యాంకులు, సర్వీస్ రిజర్వాయర్లలో గరిష్ఠ స్థాయిలో నీటి నిలువలు ఉంచుకోవాలని, నీటి వనరుల వద్ద క్లోరినేషన్ చేయడం, గెడ్డలు, కాలువలలో వ్యర్థాలు నిల్వ లేకుండా చూడాలని, మ్యాన్ హోల్‌పై మూతలు సరిచేయాలని ఆదేశించారు. ప్రజారోగ్యవిభాగాధికారులు కాలువలు శుభ్రం చేసేందుకు తగిన పనిముట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. కాలువలు, గెడ్డలు, కల్వర్టులలో వ్యర్థాల తొలగింపు, ఎమ్ఎంహెచ్‌లు 24 గంటలు పారిశుధ్య సిబ్బంది విధులను పర్యవేక్షించాలని, అంటూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. నగర ప్రజలు సహాయక చర్యల కోసం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో గురువారం నుంచి శనివారం వరకు 24 గంటలు కంట్రోల్ రూము పనిచేస్తుందని పేర్కొన్నారు.

హనీ ట్రాప్ వ్యవహారంలో స్పీడ్ పెంచిన ఎన్ఐఎ

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో

నేవీ అధికారుల హనీ ట్రాప్ కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) స్పీడును పెంచింది. ఈ మేరకు గురువారం విశాఖలో పలు చోట్ల ఎన్ఐఎ అధికారులు తనిఖీలు చేశారు. 2021వ సంవత్సరంలో కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ నమోదు చేసిన కేసుకు సంబంధించి దేశవ్యాప్తంగా తాజాగా ఏడు రాష్ట్రాల్లో 16 ప్రాంతాల్లో విస్తృత తనిఖీల్లో భాగంగా విశాఖలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా తనిఖీలు చేపట్టారు. భారత రక్షణ శాఖ సమాచారాన్ని పాకిస్తానీ ఐఎస్ఐకి చెందిన అనుమానితుల లక్ష్యంగా తనిఖీలు జరిపారు. ఐఎస్ఐ నుంచి డబ్బులు అందుకున్న వారిపై కూడా ఎన్ఐఎ నిఘా పెట్టింది. రెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంతో పాటు గుజరాత్, కర్నాటక, కేరళ, తెలంగాణ, ఉత్తరాదికి చెందిన 16 ప్రాంతాల్లో సోదాలు జరిపింది. ఈ సోదాలలో 22 సెల్ ఫోన్‌లు కీలక పత్రాలు లభించాయని తెలుస్తోంది. ఎన్ఐఎ త్వరలో పూర్తి స్థాయి వివరాలు వెల్లడించే అవకాశం ఉందని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మిక సంఘాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్ సమావేశాలు జరిపి మాటలతో కాకుండా చేతలతో ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 1295వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో విఎస్ఇయు, యూస్, విఎస్ఎంఎస్, డిఐటియు యూనియన్లకు చెందిన వివిధ విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మహాలక్ష్మినాయుడు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం కలిపి చేస్తున్న కుట్రలను కార్మికుల ఐక్యంగా తిప్పికొడతారని తెలిపారు. యువ కార్మికులు ఇప్పటికే ఆందోళనలో ఉన్నారన్నారు. స్టీల్ ప్లాంట్ భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా నిరసించారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థికంగా ఆదుకోవాలని, సొంత గనులు కేటాయించాలని, ఉత్పత్తిని పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలను ముమ్మరం చేయాలని డిమాండ్ చేశారు.

స్మాల్ అండ్ మీడియం పత్రికల అసోసియేషన్ ఆవిర్భావం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో జర్నలిస్టులకు అన్నివిధాలా అండగా నిలిచే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌కు అనుబంధంగా విశాఖలో స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ గురువారం ఏర్పడింది. విశాఖలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పి.నారాయణల సమక్షంలో అధ్యక్షునిగా విఎస్ జగన్మోహన్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా డి. చక్రపాణి, కెవి.శర్మ, సదాశివరావు, వెంకటరెడ్డి, కె.ఎ.దొర, కోశాధికారిగా వి.గణేశ్వరరావు, మరి కొంతమంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా కె.ప్రభాకరరావు, బి ప్రసాద్, వై రాజశేఖర్, జె.జగన్నాథం, ఎం ప్రమీలారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ముందుంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జె.శ్రీనివాసరావు, పిఎస్.ప్రసాద్, కె.మురళీకృష్ణ, బి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో రూపొందించిన ఆర్‌టిపిసిఆర్ కిట్‌ను ఆవిష్కరించిన చంద్రబాబు

ప్రజాశక్తి-విశాఖ బ్యూరో చీఫ్ : మంకీపాక్స్ వ్యాధి నిర్ధారణ కోసం పూర్తి స్వదేశీయంగా విశాఖపట్నం మెడ్ టెక్ జోన్‌లో రూపొందించిన ఆర్‌టిపిసిఆర్ కిట్‌ను సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. విశాఖ మెడ్ టెక్ జోన్ సిఇఒ జితేంద్ర శర్మ, జోన్ ప్రతినిధులు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ కిట్‌ను తక్కువ ధరతో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మెడ్ టెక్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు.



ఆర్‌పిసిఆర్ కిట్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

అధునాతన హోమ్ లిఫ్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నిబావ్ లిఫ్ట్స్ తమ నిబావ్ సిరీస్ 4 హోమ్ లిఫ్ట్‌లను గురువారం సూర్యాబాగ్‌లోని కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిబావ్ లిఫ్ట్ సిఇఒ విమల్ బాబు మాట్లాడుతూ, ఈ కొత్త ఆవిష్కరణ అసాధారణ డిజైన్‌తో అధునాతన సాంకేతికతను అనుసంధానిస్తుందని తెలిపారు. ఖచ్చితమైన నావిగేషన్, సున్నితమైన ల్యాండింగ్ కోసం ఎఐ ఆధారిత క్యాబిన్ డిస్‌ప్లే, సహజమైన ఎల్‌ఒపి డిస్‌ప్లే, లిడార్ 2.0 టెక్నాలజీ ఫీచర్లతో కూడిన సౌకర్యాన్ని అందిస్తుందని వివరించారు. ఈ లిఫ్టులు యాంబియంట్ లైటింగ్, న్యూజిలాండ్ ఉన్ని తివాచీలు, స్టార్‌లైట్ సీలింగ్‌లు, లెదర్ ఫినిషింగ్ ఇంటీరియర్స్‌తో స్టైలిష్‌గా రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ జె శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

నగరంలో 10.5 మెటర్ల బ్యాటరీని మార్చే బస్సులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలో 10.5 మెటర్ల బ్యాటరీని మార్చే బస్సులను ప్రవేశ పెట్టినట్లు సన్ మొబిలిటీ ప్రతినిధి అశోక్ అగర్వాల్ తెలిపారు. ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బెంగళూరు ఆధారిత వీరవాహన భాగస్వామ్యంతో ఒక అగ్ర తయారీదారుగా సన్ మొబిలిటీ నిలిచిందన్నారు. భారతదేశంలో మొట్టమొదటి మాడ్యులర్ బ్యాటరీ స్వాపింగ్ టెక్నాలజీతో ఈ భారీ వాణిజ్య వాహనాల శ్రేణిని ప్రవేశ పెట్టినట్లు చెప్పారు.

14న లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి గిరిధర్

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : వచ్చేనెల 14న నిర్వహించే జాతీయ లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ అన్నారు. గురువారం జిల్లా కోర్టులోని నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ న్యాయవాదులు, పోలీసులు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులతో జాతీయ లోక్అదాలత్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు లోక్అదాలత్ విజయవంతానికి తగు సూచనలు చేశారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి కె.రాధారత్నం, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ, డిసిపి క్రైమ్ లతా మాధురి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర కీలకం

- గీతంలో అపోలో టైర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి -మధురవాడ: ఆరోగ్యకర వాతావరణంలో రాబోయే తరాలు జీవించాలంటే పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర కీలకమని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెవిఎస్.కృష్ణ అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా అపోలో టైర్స్ సంస్థ నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు పర్యావరణం పై క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆచార్య కృష్ణ మాట్లాడుతూ, తూర్పు తీరంలో మడ అడవుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. పర్యావరణ పరిరక్షణను పరిశ్రమలు సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. యువతలో పర్యావరణంపై అవగాహన పెంచేలా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ అడవుల పెంపకం, నీటి వనరుల సంరక్షణ, పట్టణ వ్యర్థాలను శుద్ధి చేయడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ ప్రస్తుత కాలంలో ఆవశ్యక అంశాలన్నారు. పర్యావరణంపై విద్యార్థులలో అవగాహనకు అపోలో సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న గీతం సైన్స్ డీన్ కృష్ణ

కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సురేష్ కుమార్ పోటీల వివరాలను వివరించారు. గురువారం నిర్వహించిన పోటీలలో నగరంలోని వివిధ విద్యాసంస్థల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిఎస్.కృష్ణ ప్రభుత్వ కళాశాల, సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటి ఫైనల్స్‌కు చేరుకున్నారు. వీరికి ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో చెన్నైలో జరిగే గ్రాండ్ ఫైనల్స్‌లో పాల్గొనే అర్హత లభించిందని అపోలో సంస్థ ప్రతినిధి బి.లీఫెన్ ప్రకటించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం ముద్దాడపేట వద్ద జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమారు 60 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం, విజయనగరం నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదస్థలిలోనే వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. మృతుడు ఎవరనేదీ తెలియరాలేదు. వివరాలు తెలిస్తే, భీమిలి పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : పొలం పనులు చేస్తుండగా పాముకాటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దాలివలస గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. దాలివలస గ్రామానికి చెందిన దమ్ము పెంటయ్య (50) గురువారం మధ్యాహ్నం తన పొలంలో ఏపుగా పెరిగిన తుప్పలు తొలగిస్తుండగా చేతిపై పాము కాటు వేసింది. వెంటనే కే కోటపాడు 50 పడకల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి పెంటయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారు.

ఉపాధి గ్రామసభల్లో 1032 పనుల గుర్తింపు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఈనెల 23న ఒకేరోజు ఏకకాలంలో నిర్వహించిన గ్రామసభల్లో 1032 ఉపాధి పనులను గుర్తించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 28,830 మీటర్ల పొడవున్న 196 సిమెంట్‌రోడ్లు, 25,432 మీటర్ల పొడవున్న 104 సిమెంట్ కాల్వలు, 6400 మీటర్ల పొడవున్న 12 బిటి రోడ్లు, 150 మీటర్లున్న రెండు పాఠశాలల ప్రహరీలు, 391 పశువుల షెడ్ల నిర్మాణం, మేకలు, గొర్రెలకు 49 షెడ్ల నిర్మాణం, ఒక కోళ్ల ఫారం, 93 నీటి కుంటలు, 25 ఎకరాల్లో 21 చోట్ల మొక్కల పెంపకం, 210 ఇంకుడు గుంతలు, 5 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం, ఎకరా విస్తీర్ణంలో చెరువు గట్టుపై మొక్కల పెంపకం, సామూహిక ప్రాంతాల్లో ఆరు ఇంకుడు గుంతలు, చెరువులు, కాల్వల పనులు 217 పనులు గుర్తించారు.

ఐదు నెలల్లో 715 పనులు..

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు లక్షా 9వేల 968 పనిదినాలు కల్పించారు. 715 పనులు చేపట్టారు. వీటి విలువ రూ.3 కోట్ల 83 లక్షలు. కుటుంబానికి ఏడాదికి వంద రోజులు పని దినాలు కల్పిస్తున్నారు. రోజుకు ఒకరికి కూలి రూ 290 లభిస్తుంది

గతేడాదిలో... 2023 -24 లో 4,530మంది కూలీలకు రెండు లక్షల 31వేల పనిదినాలు కల్పించారు. 761 పనులు చేపట్టారు.

అంచనాలు రూపొందిస్తున్నాం..




ఈ నెల 23న 16 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టడానికి 1032 పనులను గుర్తించాం. దీనికి సంబంధించి ఏ మేరకు బడ్జెట్ కేటాయింపులు అవసరమనేది అంచనాలు తయారు చేస్తున్నాం

జివిఎస్ గౌరి,ఉపాధి ఎపిఒ, భీమిలి మండలం

చెట్టు కాదిది..

విద్యుత్ స్తంభమే..!



ప్రధాన రహదారిలో నిండుగా పచ్చని తీగలు అల్లుకున్న విద్యుత్‌స్తంభం

ప్రజాశక్తి- పద్మనాభం : వర్షాల సీజన్‌లో విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా సంబంధిత శాఖ సిబ్బంది విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టడం పరిపాటి, ఇందులో భాగంగా విద్యుత్ లైన్ల కిందనున్న చెట్లను, కొమ్మలను తొలగిస్తుంటారు. అయితే .మండలంలోని అనంతవరం గ్రామానికి వెళ్లే విద్యుత్ లైన్ నిర్వహణలో నిలువెత్తు నిర్లక్ష్యం కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు. అనంతవరం సమీపంలో ఎంవి బిల్డర్స్ లేఅవుట్ ఎదురుగా పద్మనాభం నుండి అనంతవరం గ్రామానికి విద్యుత్తు సరఫరా చేసే 33కెవి విద్యుత్‌లైన్‌లోని స్తంభాలకు పెద్దఎత్తున పిచ్చిమొక్కలు, తీగలు, పొదలు దట్టంగా అల్లుకుని ఏకంగా విద్యుత్ స్తంభమే కనిపించని పరిస్థితి కనిపిస్తోంది. అనంతవరం జంక్షన్ నుంచి అలమండ ఆర్‌ఎస్ రోడ్డు మార్గంలో రెండు విద్యుత్తు స్తంభాలకు ఇలాగే పొదలు అల్లుకుపోవడంతో అవి కరెంట్ స్తంభాల్లా కాకుండా, చెట్లు మాదిరిగా దర్శనమిస్తున్నాయి. దీంతో వర్షం కురిసినపుడు అటుగా వెళ్లి తడిలో ఉన్న వాటిని తెలియకుండా ఎవరైనా పట్టుకుంటే ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. అంతేకాక ఆకుపచ్చగా కనిపిస్తున్న తీగలు, పొదలును తినేందుకు పశువులు, మేకలు తినడానికి ప్రయత్నిస్తే విద్యుత్‌షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని పెంపకం దారులు అంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



అనకాపల్లిలో క్రీడాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి:మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం అనకాపల్లి టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పిఎస్ గిరీషా, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, క్రీడాభివృద్ధి అధికారి ఎల్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వ్యాయామ ఉపాధ్యాయులను, క్రీడాకారులను అభినందించి అంతర్జాతీయ క్రీడాకారులను సత్కరించారు.

స్థానిక డైట్ కళాశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠ రావు,కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని మామిడిపాలెం జెడ్‌పి హైస్కూల్‌లో హెచ్‌ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు లంకా గౌరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయ్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ఏ.కొత్తపల్లి, కాశీపురం జెడ్‌పి హైస్కూళ్లలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆ పాఠశాలల హెచ్‌ఎంలు వై.స్వర్ణలత, పిఇటి సుందరి, ఉపాధ్యాయులు కె.లక్ష్మి సత్యవతి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా మండలంలోని హరిపాలెం జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు పలు రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ కవుల వేషధారణలో పాఠశాలకు విచ్చేసి పలు రకాల నాటికలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన చేశారు. పోటీలలో విజేతలకు హెచ్‌ఎం ఎస్.రవి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పిడి రాజు, పట్నాయక్, కుమార్ రమణి పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటిలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ , వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ , బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్ తదితర ఈవెంట్స్‌లో పోటీలు నిర్వహించగా, 78 టీమ్స్ 936 పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.విజేతలకు ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ , అంతర్జాతీయ పర్వతారోహకులు అన్మిష్ వర్మ బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్. ప్రసాదరాజు, డాక్టర్ ఎస్. శంభు ప్రసాద్ ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో మాతృభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనందపురం కూడలి వరకు తెలుగుభాష మాధుర్యాన్ని వివరిస్తూ నినాదాలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో దుక్క అప్పల రాజు అధ్యాపకులు బి. సత్యనారాయణ పాల్గొన్నారు.

తగరపువలస: స్థానిక శ్రీ బాసర విద్యాసంస్థలలో . జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కొద్ది రోజులుగా నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కాలేజ్ చైర్మన్ పూడి రమేష్ బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎఒ కేశవ్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు

నక్కపల్లి:స్థానిక హైస్కూల్ మైదానంలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. హాకీ క్రీడాభివృద్ధికి ధ్యాన్ చంద్ చేసిన సేవలను కొనియాడారు.అనంతరం ఇటీవల జాతీయ స్థాయిలో హాకీ టోర్నమెంట్‌లో గెలుపొందిన హాకీ క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీసం రాజు,ఉపాధ్యాయులు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, కోచ్ రాంబాబు పాల్గొన్నారు .



నక్కపల్లిలో ధ్యాన్‌చంద్‌కునివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు

లోకేష్‌ను కలిసిన బంటుపల్లి



లోకేష్‌తో టిడిపి నేత శ్రీనివాస్

ప్రజాశక్తి -ఆనందపురం: విశాఖలో మూడు రోజుల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విశాఖపట్నంలో ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బంటుపల్లి శ్రీనివాస రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పలు సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆనందపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అన్న క్యాంటీన్, రైతు బజార్ ఏర్పాటు తదితర విషయాలపై విన్నవించినట్లు శ్రీను తెలిపారు. దీనికి లోకేష్ సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్ తెలిపారు.

సిపిఎం నేత మల్లేష్‌కు మాతృవియోగం


కొండమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- గాజువాక :సిపిఎం అక్కిరెడ్డిపాలెం ఏరియా కమిటీ నాయకులు వి.మల్లేష్‌కు మాతృవియోగం జరిగింది. మల్లేష్ తల్లి వి. కొండమ్మ, గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, స్థానిక నాయకులు ఎ.లోకేశ్వరరావు, దాసరి. అప్పారావు అక్కిరెడ్డిపాలెం చేరుకుని, కొండమ్మ భౌతికాయానికి నివాళులర్పించారు. మల్లేష్‌ను ఓదార్చి సంతాపం ప్రకటించారు.

దిశ ఎసిపిగా పెంటారావు


దిశ ఎసిపి పెంటారావు

ప్రజాశక్తి -మధురవాడ : దిశ ఎసిపిగా సిహెచ్ పెంటారావు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జివిఎంసి ఎనిమిదో వార్డు ఎండాడ దరి మహిళా పోలీస్‌స్టేషన్ వద్ద నున్న ఎసిపి కార్యాలయంలో ఆయన విధుల్లో చేరారు. ఇక్కడ ఎసిపిగా పనిచేసిన సిహెచ్.వివేకానంద్‌ను శ్రీకాకుళం డిఎస్‌పిగా బదిలీ చేయగా, ఖాళీస్థానంలో 1991వ బ్యాచ్‌కు చెందిన పెంటారావును నియమించారు. పెంటారావు గతంలో విశాఖ సిటీ పోలీస్ శాఖలో పలు హోదాల్లో విధులు నిర్వహించారు. రెండవ జోన్ నేరవిభాగం ఎసిపిగానూ పనిచేశారు. ఈ సందర్భంగా ఎసిపి పెంటారావు మాట్లాడుతూ మహిళలకు పూర్తిస్థాయి భద్రత కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, వారికి ఎటువంటి ఇబ్బందులొచ్చినా వెంటనే పోలీసుల్ని ఆశ్రయించాలన్నారు. అందరి సహకారంతో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. మహిళలు ఇంటా, బయట, పనిప్రదేశంలో ఎదుర్కొంటున్న సమస్యలకు మహిళా పోలీస్‌స్టేషన్లో తక్షణ పరిష్కారం లభిస్తుందని భరోసానిచ్చారు.

నేత్రదానంపై అవగాహనకు ప్రచారం


అనంతవరంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పద్మనాభం: 39వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో మండలంలోని అనంతవరం పిహెచ్‌సిలో గురువారం నేత్రదానంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. నేత్రదానంపై ప్రజల్లో అపోహలు పోయి, చైతన్యం కలిగించేందుకు కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన నేత్రవైద్య శిబిరంలో 50మందికి కంటిపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ స్వప్న, ఆప్తాల్మిక్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కేంద్ర రక్షణమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - గోపాలపట్నం : విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ - డేగకు విచ్చేసిన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను విశాఖ విమానాశ్రయంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పుష్ప గుచ్ఛంతో ఘనస్వాగతం పలికారు.


కేంద్రమంత్రిని స్వాగతిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నిలువు నీడ లేక అవస్థలు!

- పాతగాజువాక జంక్షన్‌లో బస్‌షెల్టర్లు లేక పాట్లు
- వందల సంఖ్యలో జనాలు రోడ్డుపైనే పడిగాపులు
- ప్రయాణికుల కష్టాలు పట్టని అధికారులు, నేతలు

ప్రజాశక్తి -గాజువాక : బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలు, ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే పాతగాజువాక జంక్షన్‌లో ప్రజలు వేచియుండేందుకు బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. రోజూ వందలాది బస్సులు, వాహనాలు, వేలాది ప్రయాణికులు ఈ సెంటర్‌లో వేచియుండి రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా సింధియా మీదుగా నగరంవైపు వెళ్లే 400, 99 నెంబర్ గల సిటీ బస్సులు పాత గాజువాక జంక్షన్, అమరావతి హోటల్ దగ్గర నిలుపుదల చేస్తారు. పాత గాజువాక నుంచి కొత్త గాజువాక, సింధియా మీదుగా నగరం వైపునకు వెళ్లే బస్సులన్నీ ఇక్కడే ఆగుతాయి. గతంలో ప్రయాణికులు కూర్చోవడానికి ఇక్కడ బస్‌షెల్టర్ ఉండేది. అయితే పాత గాజువాక జంక్షన్,వాణిజ్యపరంగా అభివృద్ధి చెందడం, ఇక్కడ రోడ్డను విస్తరించి, వెడల్పు చేయడం వంటి చర్యలతో అక్కడున్న దుకాణాలకు ఎదురుగా ఉండే బస్‌స్టాప్‌ను తొలగించేశారు. దుకాణాల ముందు ప్రయాణికులు నిలబడి ఉండడంతో తమ వ్యాపారాలకు ఆటంకంగా ఉంటుందనే కారణంతోనే ఇక్కడ వ్యాపారులు రాజకీయ నేతలపై ఒత్తిడి తెచ్చి బస్‌షెల్టర్ లేకుండా చేసేశారని స్థానికులతోపాటు ప్రయాణికులు అంటున్నారు. చివరకు ఫుట్‌పాత్‌లను కూడా ఆక్రమించేసిన పరిస్థితి ఇక్కడ ఉంది. దీంతో ఈ బస్‌స్టాప్‌లో వేచియుండే ప్రయాణికులు, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వందల సంఖ్యలో విద్యార్థులు రోడ్లపైనే పడిగాపులు పడాల్సిన దుస్థితి, ఎండావానల్లో వారికి నిలువనీడ లేని దుస్థితి నెలకొంది. వర్షం కురిస్తే తడవకుండా ఉండేందుకు దుకాణాల చాటుకు వెళదామన్న అక్కడా చోటులేని పరిస్థితి ఉంది. దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇక వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలైతే బస్సుల కోసం వేచియుండే క్రమంలో కనీసం కూర్చునేందుకు వీలులేని స్థితిలో అవి వచ్చేంత వరకు రోడ్డుపైనే అవస్థలు పడుతూ ఆరుబయటే నిలవాల్సిన దుస్థితి ఉంది. ఇక వర్షం కురిస్తే ఇక్కడ బస్సుల కోసం వేచియుండే వారు పడే అగచాట్లు అన్నీఇన్నీ కాదు. ఈ జంక్షన్‌లో బస్‌స్టాప్ నిర్మించాలని పలుమార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేదని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


రోడ్డుపై వర్షంలో బస్సుల కోసం వేచియున్న విద్యార్థినులు

కుసులవాడ మైనింగ్ అనుమతులపై / గంటా వైఖరి స్పష్టం చేయాలి : సిపిఎం


మాట్లాడుతున్న సిపిఎం నేత మూర్తి

ప్రజాశక్తి- ఆనందపురం:కుసులువాడ మైనింగ్ అనుమతులపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన వైఖరి స్పష్టం చేయాలని సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. ప్రజారోగ్యానికి ప్రమాదకరమైన మైనింగ్‌పై ప్రజల పక్షాన నిలబడాలని కోరారు. గురువారం వేములవలసలో విలేకరులతో మాట్లాడుతూ బుధవారం చిన్నయపాలెంలో మైనింగ్‌పై జరిగినప్రజాభిప్రాయ సేకరణను ప్రజలందరూ ఐక్యంగా ఎదిరించారన్నారు. వైసిపి హయాంలో ఇచ్చిన జిఒలన్నింటినీ రద్దుచేసిన ప్రస్తుత ప్రభుత్వం కుసులవాడ మైనింగును ఎందుకు రద్దు చేయలేదన్నారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే కుసులువాడ మైనింగ్ అనుమతులు రద్దు చేయాలన్నారు. క్వార్ట్జ్ జెట్ మైనింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మొదటి నుంచి అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. పర్యావరణ నివేదికను కుసులువాడ గ్రామ సచివాలయంలో పెట్టకుండా అధికారులు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారన్నారు. జనావాసాల మధ్య నిర్వహించే కుసులువాడ మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని, ముందు ప్రజాభిప్రాయసేకరణ, ఇతరత్రా సాకులతో దీనిపై గ్రామసభ నిర్వహించొద్దని సూచించారు. పర్యావరణానికి, ప్రజా ఆరోగ్యానికి నష్టం కలిగించే ఎటువంటి చర్యలనైనా ఎదిరించడానికి, ఈ వ్యవహారంలో కార్పొరేట్ సంస్థల తీరును వ్యతిరేకించడానికి ప్రజల పక్షాన సిపిఎం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నర్సింగరావు పాల్గొన్నారు.

కార్మిక నేతకు ఘన సత్కారం

ప్రజాశక్తి-ఉక్కునగరం :ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఎంసిపిఐయు పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఎఐసిటియు ప్రధాన కార్యదర్శి, పోరాట కమిటీ సభ్యుడు, సీనియర్ కార్మిక నాయకుడు చిత్రాడ సన్యాసిరావును ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. స్టీల్ ఉద్యమంలో కృషిని కొనియాడారు.

చెరువులు, కాలువల్లో పూడికలతో పోటెత్తిన వర్షపు నీరు..

ముంపు బారిన వరి పొలాలు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం దొంతల వారి చెరువు, కాలువల్లో పూడికలు తీయకపోవడంతో బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షాలకు వర్షపునీరు పోటెత్తి పంటపొలాలను ముంచెత్తింది. నిండా పూడికలతో నీరు సాఫీగా మళ్లిపోయే వీలు లేకపోవడంతో భారీ ఎత్తున నీరు నిలిచిపోవడంతో ఆనుకుని ఉన్న వరిపైర్లు ముంపుబారిన పడ్డాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. దొంతల వారి చెరువు చప్టా మీదుగా నీరు పోయే కాలువల నిండా పిచ్చిమొక్కలు, పూడికలు నిండుకోవడంతో వర్షపునీరు ప్రవహించడానికి వీలులేకపోవడంతో పెద్దఎత్తున ఎగపోటెత్తింది. దీంతో చెరువు, కాలువలను ఆనుకుని ఉన్న బంటుబిల్లి అప్పలనారాయణ, బంటుబిల్లి అప్పలనాయుడు, చందక చంద్రయ్య, చందక సన్యాసి బంటుబిల్లి సన్యాసి తదితరుల రైతులకు చెందిన వరిపొలాల్లోకి నీరు ముంచెత్తి పైర్లను ముంచెత్తింది.వర్షాలు కొనసాగుతుండంతో నీరు మళ్లిపోయే వీలు లేకపోవడంతో ముంపుబారిన పడ్డ పైర్లు కుళ్లిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.


వర్షపునీరు పోటెత్తడంతో ముంపుబారిన వరి పైర్లు

దొంతలవారి చెరువు చప్టా, కాలువల మరమ్మతులకు 2019 ఎన్నికల ముందు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై పనులు చేపట్టినా, మధ్యలోనే వదిలేయడం, ఆ తర్వాత పట్టించుకునే దిక్కు లేకపోవడంతో ప్రస్తుతం వర్షాలకు చెరువులు నిండి, కాలువల్లో నీరు నిలిచిపోయి, పంటపొలాల్లోకి నీరు చొరబడి నిలిచిపోయింది.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కాలువల్లోని పూడికలు తీత, మరమ్మతులు చేపట్టి, పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

క్రీడా పోటీల్లో కేథరిన్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన కేథరిన్ విద్యార్థులతో కలెక్టర్

ప్రజాశక్తి- తగరపువలస :2023 -24 విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్స్‌లో స్థానిక కేథరిన్ పబ్లిక్ స్కూల్‌కు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం లభించినట్లు కేథరిన్ విద్యా సంస్థల అధినేత ఆలీవర్ రాయ్ తెలిపారు. గురువారం ఎయులో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ నుంచి ప్రతిభా పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. ఫుట్‌బాల్, కరాటే, బేస్‌బాల్, నెట్ బాల్, సాఫ్ట్ బాల్, కరాటే క్రీడల్లో 161 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు .కలెక్టర్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ సౌజన్య, స్పోర్ట్స్ హెచ్ఒడి, అనిల్, పిఇటి బాలు, రాజుక్రీడా ప్రతిభా అవార్డును అందుకున్నారు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని / తక్షణమే రద్దు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక :విద్యుత్తు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సిపిఐ గాజువాక శాఖ కార్యదర్శి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుతరావు డిమాండ్ చేశారు. గురువారం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో మీటర్ రీడర్ల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు ఒప్పందానికి ఒకే అంటే, ప్రస్తుతం టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొనసాగించడం దుర్మార్గమన్నారు. విపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని అంగీకరించబోమని వెల్లడించిన సిఎం చంద్రబాబు, ఇపుడు అధికారంలోకి వచ్చాక మాటమార్చడం సరికాదన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తుంటే, ఇక్కడ దాన్ని అమలు చేయడం, ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో బిగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లపై వెనక్కు తగ్గకుంటే, పెద్దఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. మీటర్ రీడర్లకు నెలసరి వేతనాలను సక్రమంగా ప్రభుత్వమే వారి ఖాతాలకు జమ చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుప్తా, ఖాన్, రాజేష్, రాజు, శ్రీను, కొండలరావు, రవి కుమార్, కళ్యాణ్, సత్తిబాబు, దివాకర్, నజీర్ అహ్మద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రికల్ వర్కర్ మృతి

- ఎక్స్‌గ్రేషియాపై సరైన హామీ ఇవ్వని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- ఎన్టీఆర్ ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన
- సిపిఎం, సిఐటియు నేతల సంఘీభావం
- దిగొచ్చిన విద్యుత్‌శాఖ అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని జగన్నాధపురంలో పనిచేస్తున్న ఆర్ఇసిఎస్ సిపిఎడబ్ల్యూ ఎలక్ట్రికల్ వర్కర్ బోయిన రామరాజు విధి నిర్వహణలో గురువారం కరెంట్ షాక్‌కు గురై మృతి చెందారు. ఆ కుటుంబానికి న్యాయం చేసేందుకు ఇటు అధికారులుగానీ, అటు ప్రజా ప్రతినిధులుగాని సరియైన హామీ ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు స్థానిక ఎన్టీఆర్ హాస్పిటల్ వద్ద ఆందోళన చేపట్టారు. రామరాజు మృతదేహం ఎన్టిఆర్ హాస్పిటల్ మార్చురీలో ఉండగా ఆర్ఈసీఎస్ ఎలక్ట్రిసిటీ డిఈ వచ్చి జగన్నాధపురం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి వస్తానని వెళ్లిపోయారు. మృతుని కుటుంబానికి సంస్థ ద్వారా రావలసిన రూ.15 లక్షలు తప్ప అదనంగా తామేమి ఇవ్వలేమని చెప్పడంతో మృతిని కుటుంబ సభ్యులు అగ్రహావేశాలతో ఆందోళనకు దిగారు. అధికారులు సరైన సమాధానం చెప్పలేదని మృతుని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా మృతుని కుటుంబ సభ్యులకు కల్పించే విధంగా కృషి చేస్తామని చెప్పి వెళ్లిపోయారు. రెవిన్యూ, పోలీస్ అధికారులు ఎవరూ ఈ సంఘటనపై సక్రమంగా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు మరింత ఆందోళన చెందుతూ హాస్పిటల్ ఆవరణలో ఆందోళన తీవ్రతరం చేశారు. దీంతో హాస్పిటల్ ఆవరణలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, కోశాధికారి వీవీ శ్రీనివాస్ రావు, సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు ఎంతో నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని, లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంతవరకు మృతదేహాన్ని హాస్పటల్ నుండి తీసుకెళ్లేది లేదని స్పష్టం చేశారు. అధికారులు స్పందించకపోవడంతో హాస్పిటల్ గేటు వద్దకు వచ్చి ఆందోళన కొనసాగించారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు కదిలి వచ్చి కుటుంబానికి పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం డిమాండ్లపై రాతపూర్వక హామీ ఇవ్వడంతో ఈ ఆందోళన విరమించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆర్ఇసిఎస్‌లో పనిచేస్తున్న సిపిడబ్ల్యు వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత, పర్మినెంట్ చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.


రామరాజు మృతదేహం


ఎన్‌టిఆర్ ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు, సిఐటియు, సిపిఎం నేతలు


మెటీరియల్ అందించిన అమ్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- చీడికాడ

అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం, అప్పలరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 22 మంది విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్యాణి, విద్యా కమిటీ చైర్మన్ ఎర్రునాయుడు, తెలుగు ఉపాధ్యాయులు రెడ్డి గంగరాజు, పిఇటి దాసు, కె.లక్ష్మణ నాయుడు, ఇతర ఉపాధ్యాయులు, వై2కె బ్యాచ్ పూర్వ విద్యార్థులు కిరణ్, గుప్తా, నాయుడు చేతులు మీదుగా ఈ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, పాఠశాల పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా కష్టపడి 100శాతం మార్కులు సాధించి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలని కోరారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలను కొనియాడారు.


మంత్రి జనార్ధన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సుందరపు

రహదారుల సమస్యపై మంత్రికి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎలమంచిలి నియోజకవర్గంలో శిథిలమైన రహదారులను పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని బుధవారం రాత్రి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కలిసి విన్నవించారు. ఈ మేరకు నియోజకవర్గంలో రహదారుల పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. దానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో ఉన్న డేన్ ఫౌండేషన్ అధినేత దొగ్గ అచ్చింనాయుడు పుట్టినరోజు వేడుకలు సందర్భంగా కే కోటపాడులోని ప్రభుత్వ 50 పడకల ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అచ్చింనాయుడు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా మండల ప్రజలకు తాను చేతనైన సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అనంత్, పార్వతీ నాయుడు, త్రినాధ్, చిరంజీవి, ఆసుపత్రి హెడ్ నర్స్ పద్మావతి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న దొగ్గ అచ్చింనాయుడు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు


ఎస్ఎంసి సభ్యులను అభినందిస్తున్న వైసిపి నాయకులు


చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ సరస్వతి, జ్యోతి

ప్రజాశక్తి -నక్కపల్లి

మండలంలోని గొడిచెర్ల ఎంపీపీ స్కూల్‌లో గురువారం ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించారు. ఈనెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహించగా కోరం లేక పోవడంతో వాయిదా పడింది. ఈ మేరకు గురువారం ఎన్నికలు నిర్వహించడంతో వైసీపీ తరపున పోటీలో నిలిచిన సభ్యులు ఎన్నికయ్యారు. చైర్మన్‌గా ఎల్ జ్యోతి బాబు, వైస్ చైర్మన్ గా ఎస్.దేవి, ఇతర కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను గ్రామ సర్పంచ్ భర్త, వైసిపి నాయకులు అల్లు రమణ, వైసిపి నాయకులు నిట్ల గోవింద్, తదితరులు సత్కరించి అభినందనలు తెలిపారు

బుచ్చయ్యపేట : మండలంలోని ఐతంపూడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఐతిరెడ్డి సరస్వతి, వైస్ ఛైర్‌పర్సన్‌గా కొమ్ము జ్యోతి ఎన్నికయ్యారు. ఈ నెల 17న జరగాల్సిన ఈ ఎన్నికలు వాయిదాపడగా, హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులను సర్పంచ్ పెద్దాడ నాయుడు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

31న నాలుగు పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలంలో 4 ప్రభుత్వ పాఠశాలలకుఈ నెల 31న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బి.కాశీ విశ్వేశ్వరరావు గురువారం స్థానిక మీడియాకు తెలియజేశారు. వడ్డాది కేజీబీవీ, సీతయ్యపేట జడ్పీ హైస్కూల్, కొత్త కొండెంపూడి, పెదపూడి ఎంపిఇపి పాఠశాలలకు ఈ నెల 17న ఎన్నికలు జరగాల్సి ఉండగా వివిధ కారణాలతో నిలిచిపోయాయని తెలిపారు. సంబంధిత పాఠశాలలకు ఈ నెల 31న ఎన్నికల నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని ఎంఈఓ తెలిపారు.

చంద్రబాబును కలిసిన సాయికృష్ణ

ప్రజాశక్తి- మునగపాక

మునగపాక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయి కృష్ణ గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేసినట్లు ఆయనకు తెలియజేయగా ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుతో టిడిపి నేత సాయికృష్ణ


మంత్రి లోకేష్‌ను సత్కరించిన టిడిపి నేత నాగజగదీష్

మంత్రి లోకేష్‌ను కలిసిన నాగజగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా విశాఖకు విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా లోకేష్‌ను దుస్సాలువతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా గండి రవికుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -సబ్బవరం

పెందుర్తి నియోజకవర్గ వైసిపి నాయకులు గండి రవికుమార్ జన్మదిన వేడుకలు గండి రవికుమార్ యువసేన ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరిపల్లి శ్రీ దుర్గాలమ్మ అమ్మవారు గుడిలో ప్రత్యేక పూజలు నేర్వహించారు . అనంతరం పెందుర్తి, సబ్బవరం గవర్నమెంట్ హాస్పిటళ్లలో రోగులకు పళ్ళు, రొట్టెలు పంపిణి చేసారు. మధ్యాహ్నం పెందుర్తి లయోలా వృద్ధ ఆశ్రమం నందు కేక్ కట్ చేసి 200 మంది వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు, రాత్రికి వేపగుంట గ్రేస్ అనాధ ఆశ్రమంలో 100మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో వైస్సార్సీపీ నాయకులు సియ్యాద్రి బాల, కర్రి బాబు, యడ్ల నాయుడు, ఐ డి బాబు, సర్పంచ్‌లు ధెడ్డం ప్రసాద్, నేబర్తి శ్రీనివాసరావు, యర్రంశెట్టి రాము, ఉప సర్పంచ్‌లు సిరపరపు వాసు, దుర్గ ప్రసాద్, అప్పికొండ సత్యనారాయణ, లగిశెట్టి కుమార్, తుంపాల శివ, దుళ్ళి నరేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.


అనాధ ఆశ్రమానికి భోజనం అందిస్తున్న రవికుమార్ అభిమానులు

అనకాపల్లిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కేంద్రం అయినప్పటికీ పారిశ్రామికంగా వెనుకబడి ఉందని, అనకాపల్లిని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అనకాపల్లి సిపిఎం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు రుత్తల శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అనకాపల్లి మండలంలో వల్లూరు, ఎరుకువానిపాలెం, రాజుపాలెం గొర్రెలవానిపాలెం, మునగపాక మండలం రామారాయుడుపేట, టి.సిరిసపల్లి, వెంకటాపురం, పరవాడ మండలం తానాం, తాడి గ్రామాల్లో లాజిస్టిక్ హబ్ పేరుతో సుమారు వెయ్యి మంది రైతులు వద్ద నుంచి మూడు వేల ఎకరాలు భూమిని 9 సంవత్సరాల క్రితం నాటి టిడిపి ప్రభుత్వం సేకరించి ఎపిఐఐసికి అప్పగించిందని చెప్పారు. కాని ఈ భూములు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయని, ఇప్పటికైనా ఆ భూముల్లో లాజిస్టిక్ హబ్, లేదా స్మార్ట్ సిటీ ద్వారా అభివృద్ధి చేయాలని కోరారు. ఉపాధిని కల్పిస్తామని భూసేకరణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, నేటికీ ఆ హామీని నెరవేర్చక పోవడంతో నిర్వాసితులు జీవన ఉపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

అనకాపల్లి పట్టణం చుట్టుపక్కల వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించిందని, ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీల అభివృద్ధికి అనకాపల్లిని పరిగణనలోనికి తీసుకోపోవడం దారుణమన్నారు. అనకాపల్లి ప్రాంతంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, దీనికి స్థానిక ప్రజాప్రతినిధులైన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం సేకరించిన ఈ భూములు విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్ సమీపంలో, ఎన్‌హెచ్-16కు దగ్గరగా, విశాఖ ఎయిర్ పోర్ట్, అనకాపల్లి, దువ్వాడ రైల్వే స్టేషన్లకు అతి సమీపంలో ఉన్నాయని, భోగాపురం ఎయిర్ పోర్టుకి వెళ్లడానికి కూడా నేషనల్ హైవే అందుబాటులో ఉందని తెలిపారు. అన్ని రకాల అనుకూలమైన ఈ భూముల్లో పారిశ్రామిక అభివృద్ధి కారిడార్‌లు ద్వారా అనకాపల్లి పట్టణాన్ని పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, మండల కమిటీ సభ్యులు బొప్పే ఉమామహేశ్వరరావు, బుగిడి నూక అప్పారావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం అనకాపల్లి మండల కార్యదర్శి శ్రీరామ్



వేలం పాట ఖరారు పత్రాన్ని అందిస్తున్న డిసిఇ రూపవతి

శిథిల భవనాల తొలగింపునకు వేలం పాట

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల/ కళాశాలలో శిథిలావస్థకు చేరిన పాత భవనాల తొలగింపు కోసం గురువారం పాఠశాలలో బహిరంగ వేలం నిర్వహించారు. డిసిఇ ఎస్ రూపవతి సమక్షంలో జరిగిన ఈ వేలంపాటకు 20 మంది హాజరుకాగా అందులో యెచ్చెర్ల శ్రీనివాస్ రావుకు 1,90,500 రూపాయలకు వేలంపాట ఖరారైంది. పాత భవనాలను వెంటనే తొలగించి, శిథిలాలు తరలింపుకు చర్యలు చేపట్టాలని వేలంపాటదారుకి ఆమె సూచించారు. ఈ మేరకు వేలం పాట ఖరారైన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. జయ ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది, మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సరైన సమయంలో వివాహాలు చేసుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : నిర్దేశించిన కాలంలో వివాహాలు చేసుకోవాలని అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య చెప్పారు. అచ్యుతాపురం కస్తూర్బా గాంధీ బాలికల వసతి పాఠశాలలో గురువారం కౌమార స్నేహ పూర్వక ఆరోగ్య దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా బాలురు, బాలికలకు ఏ వయసులో వివాహాలు చేయాలి అనే అంశంపై వైద్యాధికారి మాట్లాడారు. 18 సంవత్సరాలలోపు 30 సంవత్సరాల పైబడిన వారు పెళ్లి చేసుకోవడం వలన వచ్చే సమస్యలను వివరించారు. కాన్పుల మధ్య అంతరం పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేణుగోపాల్ స్టాఫ్ నర్స్ విస్మరి కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు ఎస్ ఉమాదేవి ఏఎన్ఎం రమణమ్మ ఆశా కార్యకర్త దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకు రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, నోబుల్ టీచర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగిగా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేస్తూ అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి వారధిగా పనిచేసి పదవీ విరమణ చేసిన పెన్షనర్ల పట్ల సానుభూతితో వ్యవహరించి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. దీనిపై రామకృష్ణ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ రెవెన్యూ అధికారి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని రావాడ పంచాయితీ శివారు బొట్టవానిపాలెం గ్రామంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సారిపల్లి జోగినాయుడు, కారుకొండ కొండయ్య, కావలి అప్పలరాజు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు పైల వరలక్ష్మి, ఇందల కొండల రావు, మరిసా అప్పల రాజు , మోటూరు వీరు నాయుడు ,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న స్థానికులు

బీమా పాలసీలపై జిఎస్‌టి రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ సభ్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి

బీమా పాలసీలపైనా, పాలసీల పునరుద్ధరణపైనా జిఎస్‌టిలు రద్దు చేయాలని కోరుతూ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఎల్ఐసి అనకాపల్లి బ్రాంచ్ వద్ద గురువారం అనకాపల్లి ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఆర్డీఏ బీమా సుగం, బీమా వాహక, బీమా ట్రినిటీ ఇంకా ఐఆర్డీఏ ప్రవేశపెట్టిన అన్ని నిలుపుదల చేయాలని కోరారు. ఎఫ్డిఐని 74శాతం నుంచి 100శాతానికి పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఎల్ఐసి ఏఐఏ 6వ అఖిల భారత సమావేశంలో చర్చించిన డిమాండ్స్ ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏవోఐ జనరల్ సెక్రటరీ కరణం మాణిక్యారావు, ఎంప్లాయిస్ యూనియన్ నుండి జేవన్ శాస్త్రి, ఆడారి శ్రీనివాస్ రావు, కన్నయ్య శాస్త్రి, ఏవోఐ ట్రెజరర్ రొంగలి అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ ఐతా రాము, టి హరిబాబు, జాయింట్ సెక్రటర్స్ జె దుర్గారావు, చిన అప్పారావు, మీడియా కన్వీనర్ ఎస్ఎస్ఎన్ హనుమంతరావు, సీనియర్ ఏజెంట్స్ నడిశెట్టి అప్పారావు, వెన్నెల సన్యాసి రావు, చింతా సురేష్, బొండా నూకరాజు, పోతల రామారావు, బాబులు, సంతోష్, రాజు, నందిని, సూర్యకళ, ఏజెంట్స్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో కాన్పులు చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కాన్పులు చేయాలని అనకాపల్లి జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, డిపిఒ జగదీష్, ఐడిఎస్పి కోఆర్డినేటర్ జనార్ధన్ అన్నారు. మాతా శిశు మరణాల నివారణకు వైద్య సిబ్బంది పనిచేయాలని కోరారు. అనకాపల్లి జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారిని డాక్టర్ లూసీ కార్డీలియా ఆదేశం మేరకు బృందం సభ్యులు గురువారం మండలంలోని హరిపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు రక్తహీనతతో మరణించకూడదని వైద్య సిబ్బందికి సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలు బాలింతలకు ఇచ్చే బలవర్ధక ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత పట్ల దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలించారు. హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఏ వసంత కుమార్, ఎంపిహెచ్ఈఓ సూరిశెట్టి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత ఉమా మహేష్, వైద్య సిబ్బంది వరలక్ష్మి నాగేశ్వరరావు, సుధా, మహాలక్ష్మి, దేవుడమ్మ, లీల, ముఖేష్, రమణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రతి నెల ఒకటో తేదీన "ఎన్టీఆర్ భరోసా" పేర ఇచ్చి పింఛన్లను ఒకరోజు ముందుగానే ఈనెల 31న శనివారం ఉదయం 6 గంటల నుండి ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టినట్లు డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే ఈనెల 31న పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పింఛను దారులు గమనించి ఈ నెల 31వ తేదీన ఇంటి వద్దనే ఉండి పింఛన్లు పొందాలని కోరారు. ఏదైనా కారణం చేత ఆరోజు పింఛన్ పొందని వారు సెప్టెంబర్ 2వ తేదీ (సోమవారం) పింఛన్ పొందడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు వన మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : వన మహోత్సవం-2024 కార్యక్రమం సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక డాక్టర్ ఎన్టీ రామారావు మార్కెట్ యార్డ్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడమైనది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొంటారని అటవీశాఖ అధికారులు తెలిపారు.

పరిశ్రమల్లో ప్రమాదాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ప్రజాశక్తి-చోడవరం

పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల్లో నిషేధిత పరిశ్రమలకు ఇక్కడ అనుమతులిచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మన పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. పరిశ్రమల వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయనుకుంటే అవి ప్రజల ఊపిరి తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని సెజ్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల వల్ల వందలాది మంది మృత్యువాత పడ్డారని గణాంకాలు చెబుతున్నాయని, బతికున్నా అవిటితనంతో జీవితాన్ని నాశనం చేసుకున్న వారు వేలాదిగా ఉన్నారని పేర్కొన్నారు. ఇటీవల అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో 17 మంది మరణించగా, 50 మందికి పైగా క్షతగాత్రులయ్యారని గుర్తు చేశారు. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్, భద్రతా ప్రమాణాలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. పరిశ్రమలు, వాటి వల్లే వచ్చే ఉపాధి అవసరమే అయినా అంత కంటే ప్రజల ప్రాణం ఇంకా ముఖ్యమని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు మేల్కొని పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాలు జరుగుతున్న పరిశ్రమల లైసెన్సులు రద్దు చేయాలని, ప్రమాదాలపై నిపుణులతో ఉన్నతస్థాయి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని జల్ జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జల జీవన్ మిషన్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత పై మంచినీరు ఎలా వాడుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. తుమ్మపాల పిహెచ్‌సి ఎంఎల్‌హెచ్‌పి పెర్సిసు మాట్లాడుతూ ఇప్పుడు దోమలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధులు చాలా ప్రమాదకరమైనవని, దీనికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలికల వ్యక్తిగత పరిశుభ్రతకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఎంఎల్‌హెచ్ ఏ రాజరాజేశ్వరి మాట్లాడుతూ ప్రతిరోజు చేతులను శుభ్రంగా కడుక్కొని వేడి వేడి పదార్థాలు భుజించాలని, కాలానుగుణంగా ఆకుకూరలు దుంప కూరలు ఎక్కువగా తినాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌విడిఎస్ పీఆర్వో చైతన్య, శారద వ్యాలీ డెవలప్మెంట్ సమితి పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ చైతన్య, జల జీవన మిషన్ రిసోర్స్ పర్సన్లు కోన అప్పారావు, వి చక్రవర్తి, కే జయలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ బలరాం, ప్రాథమిక పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ గగనం జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


అనకాపల్లిలో నివాళులు అర్పిస్తున్న జేసీ, డిఆర్ఓ

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి

తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గిడుగు చిత్ర పటానికి ఘనంగా నివాళి అర్పించారు.

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

అనకాపల్లి:తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టట్ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్వో దయానిధి పూలమాలను వేసి ఘన నివాళులర్పించారు.కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాల జెడ్పి హైస్కూల్లో విద్యార్థులకు పద్యాలు, డిబేట్, వ్యాసరచన పోటీలు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.శంకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశింకోట : తాళ్లపాలెం శ్రీగాయత్రి పాఠశాలలో తెలుగుతల్లి రూపంలో విద్యార్థినులు అలరించినారు. విద్యార్థినీ విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. తెలుగు నాటకం, పొడుపు కథలు ప్రదర్శించారు. కరస్పాండెంట్ రామ్ కుమార్, హెచ్ఎం వై.నగేష్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి జెడ్పి హైస్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. నృత్య ప్రదర్శనలు చేశారు. పద్య పఠన, వ్యాసరచన పోటీలు నిర్వహించి, గణిత ఉపాధ్యాయుని బి.కరుణ ఆర్థిక సహాయంతో బహుమతుల ప్రదానం చేశారు. గ్రంథాలయానికి పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవీంద్రబాబు, టివి.రమణ, ఎంవి నూకేశ్వరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న విద్యాసంస్థల్లో తెలుగు భాషా దినత్సోవంలో గిడుగు చిత్రపటానికి సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, డిసిసిబి మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణ మూర్తి, తెలుగు అధ్యాపకులు బండారు వెంకటరమణ మూర్తి, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తెలుగు భాషపై పద్యాలు, గేయాలు పాడిన పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు తెలుగు నిఘంటువులను, జ్ఞాపికలను అందించారు. తెలుగులో ఉపన్యాసించిన తెలుగు టీచర్ రాళ్ళపల్లి రమేష్, సీమసురి జ్యోతిని సత్కరించారు. గిడుగు రామ్మూర్తి వేషధారణ విద్యార్థి పట్నాల చేతన్‌బాబుకు జ్ఞాపిక అందించారు.

చోడవరం : మండలంలో పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల ప్రదర్శించారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జూనియర్ కాలేజీలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేశారు. విద్యార్థులకు తెలుగు భాష పాండిత్యంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని పాటిపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ పీలా ఆశ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో తెలుగులో 99 మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులకు ఎంఈఓ వేణుగోపాల్, శివనాయుడు పెద్దబాలశిక్ష, సర్టిఫికెట్ ఫైల్స్‌లను అందజేశారు. ఎస్ఎంసీ మెంబర్స్, పెంటకోట పద్మ రాగమణి, బుద్ధ దేవకి, జగదాంబ పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం హైస్కూలులో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. సత్యనారాయణ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరిం చుకొని గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ శిష్ట వ్యవహారిక భాషను రూపకల్పన చేయడానికి గిడుగు రామ్మూర్తి తన జీవితాన్నే త్యాగం చేశారని, తెలుగు సాహిత్యంలో ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచాయని కొనియాడారు. తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు మాట్లాడుతూ, తెలుగు భాషను సామాన్యులకూ సులభంగా అందించాలనే ఉద్దేశ్యంతో వచన వ్యవహారిక భాషను స్థాపించడంలో గిడుగు రామ్మూర్తి అగ్రగణ్యులుగా నిలిచారన్నారు. చిన్నారులకు పద్యపఠనం పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజయ్యపేట హైస్కూల్లో హెచ్ఎం నారాయణరావు, వేంపాడు హైస్కూల్లో హెచ్ఎం సత్యారావు ఆధ్వర్యంలో మాతృభాష, క్రీడా దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

కోటవురట్ల:తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా రాజుపేట గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా వ్యాచారచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగు భాషదినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవంను గ్రంథాలయాధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మెయిన్) తెలుగు ఉపాధ్యాయని శ్యామలదేవి గిడుగు. రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మెయిన్) వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కేవి.సుబ్బారావు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మాడుగుల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.వి. ఎస్.ఎస్.శాస్త్రి తెలుగు భాష చరిత్రను, ఆవశ్యకతను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి, అధ్యాపకులు పులవర్తి పైడిరాజు, రామ్ కుమార్ మాట్లాడారు. స్థానిక బుర్రకథ కళాకారులు ఎం.ఎం. దాసును కళాశాల ప్రిన్సిపల్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక జివిఎంసి ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం చెట్టి సింహాచలం మాట్లాడుతూ, తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ శ్రీనివాసరావు, వెంకటరావు, మరగడ రామకృష్ణ, రవికుమార్, అశోక్, లక్ష్మి, సిఆర్‌పి వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవంలో ఎయు విశ్రాంత తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న పాల్గొని, తెలుగు భాషకు, వ్యావహారిక భాషకు గిడుగు రామమూర్తి చేసిన కృషిని కొనియాడారు. తెలుగుభాషపై తాను రాసిన పలు పుస్తకాలను ఆచార్య సిమ్మన్న కళాశాల లైబ్రరీకి బహూకరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి, కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ, అధ్యాపకులు డాక్టర్ వై శ్రీనివాసరావు, పి గౌరీశంకర్ , ప్రసాద్, డి.మాధురి, అనుపమ పాల్గొన్నారు.


భీమిలిలో మాట్లాడుతున్న చెట్టి సింహాచలం


కోటవురట్లలో నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద పంచాయితీ కృష్ణంరాజుపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం సత్య నారాయణ, పాల్గొన్నారు.

ములగాద: మల్కాపురం శాఖా గ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడారు. గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : గుడిలోవ విజ్ఞాన విహార్‌లో నన్నయ నుంచి నారాయణరెడ్డి వరకు పలువరి కవుల చిత్ర ప్రదర్శన, పాఠశాల గ్రంథాలయంలో వున్న ప్రాచీన గ్రంథాలు, తెలుగు సాహిత్య పుస్తకాలు ప్రదర్శన పెట్టారు.

గాజువాక.: గాజువాక ఎంవి ర్ కళాశాలలో గిడుగుకు నివాళులర్పించారు.కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వి తేజేశ్వరరావు, డాక్టర్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌వి కృష్ణ, పాల్గొన్నారు.

సీతమ్మధార : డాక్టర్ ఎల్.బుల్లయ్య కాలేజీలో గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ ఇ. మధుకుమార్ మాట్లాడారు. ప్రిన్సిపాల్ జివిస్‌కె. చక్రవర్తి, కె.సోమేశ్వరరెడ్డి, దీపక్ చౌదరి వైస్ ప్రిన్సిపల్స్ శ్రీకాంత్, సురేఖ, పైడిరాజు, మాలతి, రవికుమార్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. డిఆర్ఓ కె.మోహన్‌కుమార్, ఎఒ కెవి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : తెలుగుదండు ఆధ్వర్యాన మద్దిలపాలెం కూడలి తెలుగుతల్లి విగ్రహం వద్ద వేడుకలను నిర్వహించారు. పలువురు సాహితీవేత్తలు, కళాకారులు, భాషాభిమానులు పాల్గొని తెలుగుతల్లికి నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయనసూరి, గంట్ల శ్రీనుబాబు, కామేశ్వర శర్మ, నరవ ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో తెలుగులోనే ప్రసంగాలు : అయ్యన్న

నర్సీపట్నం టౌన్:తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో నివసిస్తున్న తెలుగువారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సమావేశంలో ఒక్క పదం కూడా ఇంగ్లీష్ వాడకుండా అచ్చమైన తెలుగులో ప్రసంగించాలని కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు గుర్తు చేశారు. భాషా పరిరక్షణ మనందరి బాధ్యతగా ఉండి, ప్రతి ఒక్కరూ తమ భాషను గౌరవించి, భవిష్యత్ తరాలకు అందించేలా కృషి చేయాలన్నారు. భాషా దినోత్సవం రోజు, తెలుగు భాషా సాహిత్యాన్ని, సంస్కృతిని కాపాడుకోవడం కోసం ప్రచారం చేయడం మనందరి బాధ్యత అన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

గ్రామాల్లో ఘనంగా పండుగలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం గ్రామంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండుగను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నాతవరం:మండలంలోని చమ్మచింత గ్రామంలో మరిణమ్మ తల్లి పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు భారీ ఎత్తున ఆలయానికి తరలి వచ్చారు.

కోటవురట్ల:మండలంలోని పలు గ్రామాలలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు గడ్డం బుజ్జి, మండల టిడిపి నాయకులు జానకి శ్రీను సహా కమిటీ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు.

కైలాసపట్నం గ్రామంలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

అభివృద్ధిపై ప్రణాళిక

ప్రజాశక్తి-నక్కపల్లి:వికసిత్ ఏపీ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని తహసీల్దార్ అంబేద్కర్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి వికసిత్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం పై చర్చించారు. మండల స్థాయి అభివృద్ధిపై రాబోయే 5 ఏళ్ల కార్యచరణ ప్రణాళికపై చర్చించి వికసిత్ ఏపీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా, యంత్రాలు

-పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు



ప్రజాశక్తి -మాడుగుల: మండలం లోని అన్ని రైతు సేవా కేంద్రాలలో 60 శాతం సబ్సిడీ పై సంపూర్ణ మిశ్రమ దాణా , 40 శాతం సబ్సిడీ పై చాఫ్ కట్టర్లు గడ్డి కోత యంత్రాలు సరఫరాకు అందుబాటులో ఉన్నట్లు మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాలు..మిశ్రమ దాణా యూనిట్ ధర కేజీ కి రూ.15.90 కాగా సబ్సిడీ రూ.9.40 పైసలకు రైతులు 6.50 చెల్లించవలసి ఉంటుందన్నారు. చాఫ్ కట్టర్లు యూనిట్ ఖరీదు రూ. 3,3970 కాగా సబ్సిడీ రూ.13588 గాను రూ. 20382 మాత్రమే చెల్లించాలని తెలిపారు.పశు భీమా ను కూడా అందిస్తున్నారని తెలిపారు.

మేకలపై చిరుత పులి దాడి

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామానికి చెందిన గిరిజనులకు చెందిన నాలుగు మేకలపై చిరుత పులి దాడి చేసింది. గురువారం మేత కోసం గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతానికి పశువుల కాపరులు తీసుకువెళ్లారు. గమనించిన చిరుత పులి మేకల మందపై దాడి చేసిందని గిరిజన రైతులు తెలిపారు. ఫారెస్ట్ శాఖ అధికారులు చిరుత పులిని బంధించి తమ మేకలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.


గాయపడ్డ మేక

రోడ్డు పక్కనే వ్యాపారాలు

-అవస్థలు పడుతున్నా ఇందిరా మార్కెట్‌కు తరలించని అధికారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ఇందిరా మార్కెట్ ఆదాయం కోల్పోతున్నప్పటికీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. స్థానిక ఇందిరా మార్కెట్‌కు సుమారు 8 మండలాల నుండి రైతులు కూరగాయలను తీసుకొచ్చి విక్రయాలు జరిపేవారు. కోవిడ్ సమయంలో ఇందిరా మార్కెట్‌ను అధికారులు చింతపల్లి రూట్‌లో డిగ్రీ కాలేజ్ సమీపంలోకి తరలించారు. ఈ మార్కెట్‌ను తరలించి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ నేటికీ ఈ మార్కెట్‌ను ఇందిరా మార్కెట్‌కు తరలించే ఆలోచన అధికారులకు తట్టలేదు. దీంతో, కూరగాయల వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు.గతంలో ఇందిరా మార్కెట్ లో శనివారం వారపు సంత జరిగేది. దీంతో మండల పరిషత్ కు ఆశీళ్ళ రూపంలో సంవత్సరానికి పది లక్షల వరకూ ఆదాయం వచ్చేది. అధికారులు సంత తరలించే విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.



రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలు

నేషనల్ ఆన్‌లైన్ యోగా పోటీల్లో

మూడో స్థానం దక్కించుకున్న సోదరులు

- విజేతలుగా నిలిచిన భరద్వాజ్, రుత్విక్

ప్రజాశక్తి-నక్కపల్లి: ఈనెల 23 నుంచి 25 వరకూ ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కర్ణాటక బీకేఎస్ అయ్యంగార్ 8వ వెంవెరియంల్ నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్ లైన్ యోగా ఛాంపియన్షిప్ పోటీల్లో నక్కపల్లి మండలం ఉపమాక గ్రామానికి చెందిన సోదరులు తృతీయ స్థానంలో నిలిచారు. 20 నుంచి 25 ఏళ్ల విభాగంలో దవరసింగి భరద్వాజ్, 12 నుంచి 15 ఏళ్ల విభాగంలో దవరసింగి ఆదిత్య రుత్విక్ పోటీల్లో నిలిచి తృతీయ స్థానం సాధించినట్టు గురువారం నిర్వాహకులు పుల్లేటి సతీశ్ వెల్లడించారు. గత ఏడాది కూడా ఆదిత్య రుత్విక్ జాతీయ స్థాయి యోగా ఛాంపియన్ షిప్ ఆన్లైన్ పోటీల్లో రెండోస్థానం సాధించారు. ఆదిత్య రుత్విక్ నర్సీపట్నం ఎంజేపీ గురుకులంలో 9వ తరగతి చదువుతుండగా, భరద్వాజ్ రాజమహేంద్రవరం వీజేఎస్ కళాశాలలో బీ.ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు.



సోదరులు



పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న టిడిపి కార్పొరేటర్లు

మున్సిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు

తప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జె.సురేంద్రను తెలుగుదేశం పార్టీ వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 24వ వార్డు కౌన్సిలర్ ధనిమి రెడ్డి మధు మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీలోని వార్డులను గత ప్రభుత్వం సమయంలో ఐదేళ్ల పట్టించుకోలేదని, శానిటేషన్ పట్ల సరైన దృష్టి పెట్టలేదన్నారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై కమిషనర్ శానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు డబ్బిరు శ్రీకాంత్, రాజుల నాయుడు, పైల గోవిందు, లాల మురళీకృష్ణ, లాలం మురళీకృష్ణ, రుత్తల కృష్ణ, నాగేంద్ర రాజు, చింటూ, జాలమురి రాజ్ కుమార్, మార్కెట్ రాజా పాల్గొన్నారు.

యువతకు డిజిటల్ నాలెడ్జిపై శిక్షణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : గిరి యువతకు నేచర్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో అరకులోయ మండలం పద్మాపురం పంచాయతీ బెడ్డగూడలో నేచర్ ట్రైబల్ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం డుంబ్రిగుడ, అరకులోయ మండలాలకు చెందిన యువతకు సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ బాలరాజు ఆదేశాల మేరకు యువతకు డిజిటల్ నాలెడ్జి, ప్రభుత్వ పథకాలు, రాయితీ, చట్టాలు, హక్కులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ రవి మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ యాప్ ల ద్వారా డిజిటల్ నాలెడ్జిపై కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో యూత్ సభ్యులకు కంప్యూటర్ నాలెడ్జి, లైఫ్ స్కిల్స్, డిగ్రీ, పీజీ, చదువుకునే యువతి, యువకులకు ఆర్థిక తోడ్పాటును సంస్థ అందిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ, గిరి యువతి యువకులకు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గ్రామసభలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని కోరారు.

కలుషిత ఆహారం ఘటనలో...

ఇద్దరు విద్యార్థులకు రూ.లక్ష పరిహారం

ప్రజాశక్తి-పాడేరు: ఇటీవల కలుషిత ఆహారం తీసుకున్న ఘటనలో ఆసుపత్రుల్లో చేరి డిశ్చార్జ్ అయిన మరో ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని డి.ఆర్.ఓ బి.పద్మావతి గురువారం అందజేశారు. ఈనెల 17వ తేదీన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో ఒక అనాధ ఆశ్రమంలో తీసుకున్న ఆహారం కలుషితం కావడంతో ముగ్గురు విద్యార్థులు చనిపోయిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన మర్రి రంజిత్, కొర్ర సుశాంత్ కుటుంబ సభ్యులకు డిఆర్ఓ తన చాంబర్ లో చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేని అనధికార వసతి గృహాలలో చేరవద్దని విద్యార్థులకు, తల్లిదండ్రులను కోరారు.



చెక్కును అందజేస్తున్న డిఆర్ఒ



రహదారికిరువైపులా ఉన్న మొక్కలు

రోడ్లకిరువైపులా తుప్పలతో తిప్పలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో రహదారి వెంబడి తుప్పల కారణంగా వాహనదారులు, పాదచారులు తిప్పలు పడుతున్నారు. రోడ్డుకి ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక పోవడంతో భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నారు. గొట్టువాడ, పందూరు, చౌడువాడ, వెంకటాపురం, నీలిగుంట సహా ప్రధాన రహదారిని అనుకొని అనేక గ్రామాలలో పలుమార్లు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి తప్పులు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రోగులకు సకాలంలో వైద్యమందించాలి

-డిసిహెచ్ శ్రీనివాసరావు- నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం డిసిహెచ్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వార్డ్, శానిటేషన్, రోగులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ముందుగా రోగులతో మాట్లాడారు. వైద్యం ఎలా అందుతుందో రోగులను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని పరిశీలించి , రోగులకు రుచి, సుచికరమైన వేడి ఆహారాన్ని ప్రతిరోజు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ శిరీషతో మాట్లాడారు. ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. ముందస్తుగా మందులను ఆసుపత్రిలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్ రవి కిరణ్, ఫార్మసిస్ట్ హిమామ్ తదితరులు పాల్గొన్నారు.



రోగి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న శ్రీనివాసరావు